క్లుప్తంగా

ఏఎస్ఐగా నాగేశ్వరరావు



శిరివెళ్ల: ఏఎస్ఐగా నాగేశ్వరావు నియమితులయ్యారు. గత ఇక్కడ పనిచేస్తున్న వాహబ్ ఆళ్లగడ్డకు బదిలీ కావడంతో ఈ నియామకం జరిగింది. నూతన ఏఎస్ఐ నంద్యాల ట్రాఫిక్ విభాగం నుంచి బదిలీపై వచ్చారు. అలాగే హెడ్ కానిస్టేబుళ్లు ఇద్దరు విధుల్లో చేరారు. పాణ్యం నుంచి గురుప్రసాదు, సంజామల నుంచి ఎం.బాషా బదిలీపై వచ్చారు.

పశుబీమాపై అవగాహన



పశువైద్య సిబ్బందికి బీమాపై అవగాహన కల్పిస్తున్న డీడీ

రుద్రవరం: వైఎస్సార్ పశుబీమా సన్న,చిన్న కారు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ వర ప్రసాదు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం రుద్రవరం,శిరివెళ్ల మండలాల పశు వైద్య సిబ్బందికి పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాద వశాత్తు పశువులు మరణిస్తే రైతులు నష్ట పోకుండా నిలదొక్కుకునేలా ప్రభుత్వం వైఎస్సార్ పశుబీమా పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, వ్యాధుల కారణంగా జీవాలు మరణిస్తే పథకం వర్తిస్తుందని చెప్పారు. పథకంపై రైతులకు అవగాహన కల్పించి బీమాకు సంబంధించి ప్రీమియం వాటా రైతులు చెల్లించేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఇదివరకే పశువులకు ట్యాగ్ వేశామని, ప్రస్తుత నిబంధనల ప్రకారం ప్రీమియం చెల్లిస్తే పథకం వర్తిస్తుందని చెప్పారు. ఏడీ గిడ్డయ్య, పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల న్యూటౌన్: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోట మద్దులు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి వేతనాలు అమలు చేయాలన్నారు. గౌస్, భాస్కరాచారి, ఆదామ్, పవన్, నాగేశ్వరరావు, ఆంజనేయులు మున్సిపల్ ఇంజనీర్ రమణ మూర్తికి వినతి పత్రం అందజేశారు.

ఎంపీపీపై దాడిచేసిన వారిని శిక్షించాలి

దొర్నిపాడు: కాకినాడ జిల్లా రౌతులపూడి మండల ఎంపీపీ విజయలక్ష్మిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని నంద్యాల జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు గోపవరం అమర్‌నాథ్‌రెడ్డి (దొర్నిపాడు ఎంపీపీ) గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రౌతులపూడిలో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ ప్రారంభోత్సవానికి ఆహ్వానించక పోవడాన్ని ప్రశ్నించినందుకు ఆమెపై దాడి చేయడం దారుణమన్నారు.

విద్యార్థినులకు సత్కారం



విద్యార్థినిలను సత్కరిస్తున్న హెచ్ఎం, పీఎంసీ చైర్మన్

దొర్నిపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థినులను జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, పీఎంసీ చైర్మన్ నర్సిరెడ్డి గురువారం ఘనంగా సత్కరించారు. పాఠశాల టాపర్ మొదటి బహుమతి పవిత్ర (573)కు రూ.3వేలు, రెండో బహుమతి జోతి (565)కి రూ.2వేలు, మూడో బహుమతి యశ్వత (559)కు రూ.వెయ్యి నగదుతో పాటు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందేజేసి తల్లిదండ్రుల సమక్షంలో సన్మానించారు.

ఈ-ఫామ్ మార్కెట్‌తో రైతుకు ప్రయోజనం

నంద్యాల (సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఈ-ఫామ్ మార్కెట్ అన్నదాతలకు ఎంతో ఉపయోగకరమని జిల్లా అగ్రి ట్రేడింగ్ మార్కెటింగ్ అధికారి అబ్దుల్ రహమాన్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్త విధానంలో గుర్తింపు పొందిన వ్యాపారులు అధికారులతో కలిసి నేరుగా రైతు కల్లం దగ్గరే దిగుబడులు కొనుగోలు చేస్తారన్నారు. ధర ఆమోదయోగ్యంగా ఉంటే అమ్ముకోవచ్చని, లేదంటే ఇతరులకు విక్రయించొచ్చని పేర్కొన్నారు. వద్దకే వచ్చి కొనుగోలు చేయడం ద్వారా రవాణా, సంచులు, తరుగు వ్యయాలు తగ్గుతాయని, సొమ్ము కూడా 24 గంటల్లో రైతుల ఖాతాలో జమ అవుతుందన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న మార్కెట్ యార్డుల్లోని గోదాముల్లో రైతులు నామమాత్రపు రుసుం చెల్లించి పంట ఉత్పత్తులను నిల్వ చేసుకోవచ్చన్నారు.

కలలో కూడా ఊహించలేదు..



తన పిల్లలతో ఇంటి ముందు నిల్చున్న మహిళ కుమ్మరి పేరు లక్ష్మిదేవి. ఆళ్లగడ్డ మండలం జి.జమ్ములదిన్నె గ్రామం. భర్త నాగరాజుతో కలిసి గడేకారి పనికి వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పెళ్లయి 15 సంవత్సరాలైనా సొంతిల్లు లేకపోయిందని మదనపడేవారు. 'గత ప్రభుత్వాల హయంలో ఎన్నో సార్లు ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా ప్రయోజనం లేక పోయింది.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే గ్రామంలో రూ.2 లక్షల విలువైన 1.5 సెంట్ల స్థలం ఇచ్చి, ఇల్లు మంజూరు చేయడంతో ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నామని, ఇలా సొంతింట్లో ఉంటామని కలలో కూడా అనుకోలేదని, జగనన్న పుణ్యాన ఇల్లు నిర్మించుకున్నందుకు సంతోషంగా ఉంది'

దేరాల్లో ఉండిపోయేవాళ్లం..



సొంతింటి ముందు కూతురితో ఉన్న మహిళ పేరు దాసరి నాగలక్ష్మి. ఈమెకు భర్త, ఇద్దరు కూమార్తులున్నారు. చాగలమర్రి ఊరి చివర కంపచెట్ల మధ్యలో పరదాల గుడిసెలో కాపురం ఉంటూ ఈత పొరకలు తయారు చేసి ఊరూరు తిరిగి అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. 20 సంత్సరాల నుంచి ఎక్కడైనా ఇంటి స్థలం చూపించాలని ఎంతోమంది కాళ్లావేళ్ల పడ్డారు. అయినా కనికరం లేకపోయింది. ఇక తమ జీవితం అంతా ఇలా డేరాల్లోనే ఉండిపోవాల్సి వస్తుందనుకుంటున్న సమయంలో జగనన్న కాలనీలో రూ.6 లక్షల విలువైన స్థలం మంజూరైంది. ప్రభుత్వ సహకారంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నారు. వసతులు అన్నీ ఉండటంతో ఐదు నెలల నుంచి జగనన్న కాలనీలోనే నివాసం ఉంటున్నారు. ఇద్దరు పిల్లలను స్కూల్‌కు పంపించుకుంటూ అక్కడే తమ కుల వృత్తి చేసుకుంటూ హాయిగా గడుపుతోంది.

కనుల ఎదుటే కలల సౌధం

- శరవేగంగా 'వైఎస్సార్ జగనన్న' కాలనీల్లో ఇళ్ల నిర్మాణం
- సాకారమవుతున్న పేదల సొంతింటి కల
- జగనన్న కాలనీల్లో వసతుల కల్పన పూర్తి
- కొన్నింటిలో ఇప్పటికే గృహ ప్రవేశాలు
- నియోజకవర్గానికి 12,120 ఇళ్లు
- లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన మొత్తం రూ.45.38 కోట్లు



చాగలమర్రిలో నిర్మాణం పూర్తయ్యి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఇళ్లు



చాగలమర్రి జగనన్న కాలనీలో విద్యుత్ లైను ఏర్పాటు చేసిన దృశ్యం

ఆళ్లగడ్డ: నియోజకవర్గంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పెద్ద ఎత్తున జరుగుతోంది. తమకు కేటాయించిన స్థలాల్లో పేదలు ఇళ్ల నిర్మాణాలను చకచకా పూర్తి చేసుకుంటూ గృహప్రవేశాలు చేపడుతున్నారు. దశాబ్దాలుగా బాడుగ ఇళ్లల్లో ఉంటూ పడిన కష్టం, నష్టం తీరి పోతుండుటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి తమ సొంతింటి కలను నెరవేర్చడంతో పాటు కాలనీల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా రూ.కోట్లు వెచ్చించి వసతులు కల్పిస్తుండటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

వేగంగా ఇళ్ల నిర్మాణం..

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొదటి విడత 7,745 మందికి, రెండో విడత 1,025 మందికి ప్రభుత్వం స్థలాలు కేటాయించారు. ఇంటి నిర్మాణం కోసం రూ. 1.80 లక్షలు ఉచితంగా అందజేస్తున్నారు. 20 టన్నుల ఇసుక ఉచితంగా ఇవ్వడంతో పాటు సిమెంటు, నిర్మాణ సామగ్రిని రాయితీపై అందజేస్తున్నారు. స్తోమత లేని వారికి మెప్మా, సెర్ప్‌ల నుంచి పావలా వడ్డీకే హౌసింగ్ రుణం అందిస్తోంది. ఇప్పటి వరకు మొదటి, రెండో విడతతో పాటు ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన కింద మొత్తం 12,120 మంది ఇళ్లకు శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు రూ.45,37,93,099 బిల్లుల సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఆరు మండాలల పరిధిలో 31 చోట్ల జగనన్న కాలనీల నిర్మాణాలు ఏర్పాటు చేశారు. నీటి వసతి, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. బోర్లు వేసి నీటి ట్యాంకులు ఏర్పాటు చేశారు.

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

పేదలందరికీ ఇళ్ల కార్యక్రమం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు, వసతులు కల్పిస్తున్నాం. ఎప్పటికప్పుడు బిల్లులు వారి ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నాం. పూర్తయిన ఇళ్లకు విద్యుత్, కుళాయి కనెక్షన్లు ఉచితంగా ఇస్తున్నాం. ఒకటి రెండు నెలల్లో వంద శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్చి చేయించేందుకు కసరత్తు చేస్తున్నాం.

– నాగరాజు, హౌసింగ్ ప్రాజెక్ట్ డీఈ

మండలాల వారీగా ఇళ్ల నిర్మాణాల వివరాలు..

మండలం	మంజూరైన ఇళ్లు	నిర్మాణం మొదలు పెట్టనివి	పునాది లెవెల్	బేస్‌మెంట్ స్థాయి	రూఫ్ స్థాయి	స్లాబ్ లెవెల్	పూర్తయినవి	లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయిన నగదు (రూ.ల్లో)
ఆళ్లగడ్డ	1,979	272	919	510	288	52	379	8,73,76,752
చాగలమర్రి	2,710	136	996	891	171	62	357	13,42,28,413
దొర్నిపాడు	705	175	305	72	80	10	68	1,98,17,653
రుద్రవరం	1,525	202	929	154	61	30	149	3,060,7,634
శిరివెళ్ల	3,513	231	1,827	399	110	95	487	11,69,80,878
ఉయ్యలవాడ	1,184	198	960	73	61	56	340	6,078,1,769

మందుల అమ్మకం నిలిపివేత



ముత్యాలపాడులో శ్రీలక్ష్మీ ఆగ్రో టెక్ షాపులో లైసెన్సును తనిఖీ చేస్తున్న ఏఓ రంగనేతాజి

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలోనున్న శ్రీలక్ష్మీ ఆగ్రో టెక్ షాపును ఏఓ రంగనేతాజి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాకు రిజిష్టర్లను పరిశీలించగా ఓ విభాగానికి సంబంధించిన ధ్రువ పత్రం లేకపోవడంతో దుకాణంలో నిల్వ ఉన్న రూ.4.30లక్షల విలువైన ఎరువుల అమ్మకాలను నిలిపివేయాలని ఆదేశించారు.

మాతా శిశువుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ

నంద్యాలటౌన్: సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో గృహ సందర్శనలో మాతా శిశువుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. గురువారం మాతా శిశు మరణాలపై స్థానిక సర్వజన ఆసుపత్రిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులకు ఏవైనా సమస్యలుంటే చికిత్సలు అందించి సుఖప్రసవం అయ్యేలా చూడాలన్నారు. జిల్లాలో ఒక్క మాతృ శిశు మరణం చోటు చేసుకోకూడదని, అలాంటి సంఘటనలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధకాల టీకాల కార్యక్రమ అధికారి డాక్టర్ ఓ ప్రభావతి దేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, డాక్టర్లు దివ్య, రాధిక, ప్రగతి, ఐసీడీఎస్ పీడీ పద్మావతి పాల్గొన్నారు.

మాన్యం వేలం రసాభాస

- దశాబ్దాల వేలాల సొమ్ముకు లెక్కలు చూపాలని నిలదీసిన నల్లగట్ల వాసులు
- వాయిదా వేసిన అధికారులు



అధికారులతో వాదిస్తున్న గ్రామస్తులు

ఆళ్లగడ్డ: మాన్యం కౌలు వేలం రసాభాసగా జరిగింది. దశాబ్దాలుగా వేలం పాటల్లో వచ్చిన ఆదాయానికి సంబంధించిన లెక్కలు చెప్పే వరకు వేలం పాటలు నిర్వహించరాదని గ్రామస్తులు భీష్మించడంతో అధికారులు వేలం వాయిదా వేసి అధికారులు వెనుదిరిగిన ఘటన నల్లగట్ల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు. నల్లగట్ల గ్రామంలో చెన్నకేశవ, ఆంజనేయ, ఈశ్వర, వీరభద్ర స్వామి దేవస్థానాలకు సంబంధించి సుమారు 86 ఎకరాల మాన్యం ఉంది. ఈ భూముల కౌలుకు ప్రతి సంవత్సరం బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. ఇందుకు గాను ప్రతి సంవత్సరం రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. దీనికి తోడు హైవే రోడ్డు నిర్మాణానికి దేవాలయం అడ్డుగా ఉందని తొలగించేందుకు హైవే సంస్థ 15 సంవత్సరాల క్రితం దేవదాయశాఖకు సుమారు రూ.75 లక్షలు అందజేసింది. ఆ సొమ్ము బ్యాంకులో డిపాజిట్ చేశామని చెబుతున్నారని, ఏ బ్యాంకులో.. ఎప్పుడు డిపాజిట్ చేశారు, ప్రస్తుతం ఎంత ఉందని నాలుగేళ్లుగా అడుగుతున్నా అధికారులు సమాధానం ఇవ్వడం లేదని వాపోయారు. ఇన్నేళ్లలో వేలం ద్వారా వచ్చిన సొమ్ము, హైవే సంస్థ అందజేసిన సొమ్ము వివరాలు తెలిపేంత వరకు వేలం నిర్వహించడానికి వీలులేదని పేర్కొన్నారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ గుడి నిర్మాణానికి రూ.98 లక్షలతో ప్రతిపాదనలు పంపామని, ఇందుకు దేవదాయ శాఖ తరఫున రూ.19.60 లక్షల మ్యాచింగ్ గ్రాంట్ కూడా డిపాజిట్ చేశారని, సాంకేతిక అనుమతులకు సంబంధించి ఉత్తర్వులు రావాల్సి ఉందని, వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. పనులు మొదలు పెట్టిన తరువాతనే వేలం పాటలు నిర్వహించమని గ్రామస్తులు స్పష్టం చేయడంతో చేసేది లేక వేలం వాయిదా వేసి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సమాధానమిచ్చి వెళ్లిపోయారు. ఈఓ సాయిజయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాలు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ నిర్మల

నంద్యాల(అర్బన్): జిల్లాలో నాడు – నేడు కింద చేపట్టిన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఐసీడీఎస్ పీడీ నిర్మల సూచించారు. స్థానిక కార్యాలయంలో గురువారం జిల్లా స్థాయి సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భవన నిర్మాణాల పనుల్లో నాణ్యత పాటించేలా చూడాలని, నిర్మాణాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతల హాజరును వైఎస్సార్ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఏపీఈడబ్ల్యూఐడీసీ బాలజోజప్ప, పీఆర్ ఏఈ సుధీర్ కుమార్, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కొత్తపల్లెను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(రూరల్): కొత్తపల్లె గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని కొత్తపల్లె గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు చేశారు. ముందుగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, మహిళలు హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో రూ.12 లక్షలతో సీసీ రోడ్లు, రూ.19 లక్షలతో నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాల ఆధునికీకరణ, గడప గడపకు మన ప్రభుత్వం కింద విడుదలైన రూ.38 లక్షల పనులకు భూమి పూజ చేశామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మెన్ మహేశ్వరరెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, ఎంపీడీఓ సుగుణశ్రీ, నాయకులు నరేంద్రరెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, హరినాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శివారెడ్డి, మహేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గోవిందరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

నంద్యాల (న్యూటౌన్): ఇటీవల ఢిల్లీలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన మణిశ్యాం, పవన్‌ను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి గురువారం అభినందించారు. వారు మాట్లాడుతూ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశానికి, జిల్లాకు మంచి తేవాలని ఆకాంక్షించారు. అనంతరం స్పోర్ట్ అథారిటీ చైర్మన్ సిద్ధార్థరెడ్డి, కృష్ణ చైతన్య, డాక్టర్ విజయ్ బాబు క్రీడాకారులను అభినందించారు. క్రీడాకారులు మాట్లాడుతూ తమకు ఆర్థికంగా సహకారం అందజేస్తే మరిన్ని పతకాలు సాధిస్తామని చెప్పారు.

వేతనాలు పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు నిర్మలమ్మ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. అలాగే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని గురువారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం కల్పించాలన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలని విజ్ఞప్తి అందజేశారు. అనంతరం సీడీపీఓ చంద్రకళకు వినతి పత్రం అందజేశారు.

పేద విద్యార్థులకు జగన్ మామ అండ



బహుమతులు పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే శిల్పా రవి, అధికారులు

నంద్యాల(న్యూటౌన్): పేద విద్యార్థులకు ముఖ్యమంత్రి జగన్ మామయ్య అండగా ఉంటారని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ స్థాయిలో ముందుండాలని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదో తరగతి, ఇంటర ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను సన్మానించారు. జెడ్పీ, ప్రభుత్వ, ఏపీ మోడల్, మున్సిపల్, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, కేజీబీవీలో మొదటి మూడు స్థానాలలో నిలిచిన వారికి నగదు బహుమతి, మెడల్, ప్రశంసా పత్రం అందజేసి సన్మానించారు. నంద్యాల నియోజకవర్గంలో పదవ తరగతి ఫలితాల్లో మొదటి ర్యాంకు సాధించిన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని చాకలి రాజేశ్వరికి రూ.15వేలు, రెండవ ర్యాంకు సాధించిన ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి ఎం.శేషఫణికి రూ.10 వేలు, మూడో ర్యాంకు సాధించిన జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థిని గోస ప్రణయ్‌కుమార్‌కు రూ.5 వేలు అందజేశారు. అలాగే ఇంటర్‌లో.. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని కోడుమూరు పూజితకు రూ.15వేలు, రెండవ ర్యాంకు సాధించిన విద్యార్థిని మౌనికకు రూ.15 వేలు, మూడవ ర్యాంకు సాధించిన పీఎస్సీ కేవిస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని షేక్ హసీనా బీకి రూ.15 వేలు అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ సుధాకర్ రెడ్డి, ఎంఈవో బ్రహ్మం నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, దృశ్య,కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, ఎంపీపీ ప్రభాకర్, వైస్ చైర్మన్‌లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, వైసీపి కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు, పీపీ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీశ్రీ వర్ధంతి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక పింగళి సూరన స్మారక శాఖ గ్రంథాలయ భవనంలో శ్రీ శ్రీ కళావేదిక జిల్లా శాఖ అధ్వర్యంలో గురువారం మహకవి శ్రీశ్రీ వర్ధంతిని నిర్వహించారు. కవులు, రచయతులు, పాఠకులు శ్రీశ్రీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయుడు అన్నెం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ శ్రీ శ్రీ కవిత్వం నేటి సమాజానికి దిక్సూచి లాంటిదన్నారు. గ్రంథాలయ అధికారి శ్రీధర్, చిలకల బాలరాజ్, ప్రసాద్, నీలకంఠమాచారి పాల్గొన్నారు.

తలనీలాల వేలం

ఆళ్లగడ్డ: రామతీర్థ పుట్టాలమ్మ క్షేత్రంలో తలనీలాలకు వేలం నిర్వహించగా రూ 10.42 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ జయచంద్రారెడ్డి తెలిపారు. గురువారం దేవస్థానం ఆవరణలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి పర్యవేక్షణలో ఏడాది పాటు తలనీలాల సేకరణ హక్కులకు వేలంపాటలు నిర్వహించారు. హోరాహోరీగా జరిగిన వేలం పాటల్లో రూ 10.42 లక్షలకు బాలనాగమ్మ హక్కు పొందారని ఈఓ తెలిపారు.

క్రీడా పరికరాలు పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో వేసవి శిక్షణ తరగతులు పూర్తి చేసిన వ్యాయమ ఉపాధ్యాయులకు క్రీడా పరికరాలు పంపిణీ చేసినట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, నంద్యాల జిల్లా కోచ్ రాజు గురువారం తెలిపారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో దేవేంద్ర, సురేష్ నాయుడు, శ్రీధర్ బాబు, బాషా మనోహర్ బాబు, గోవర్ధనరెడ్డి, కోచ్‌లు బ్రహ్మయ్య, కిశోర్, బిలాల్ పాల్గొన్నారు.

వేలంలో పెరిగిన ఆదాయం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

నంద్యాల(అర్బన్): కొత్తపల్లె మండలం సంగమేశ్వరం వద్దనున్న పర్యాటక శాఖ రెస్టారెంట్ నిర్వహణకు చేపట్టిన వేలంలో రూ.1.78 లక్షల ఆదాయం వచ్చిందని జిల్లా పర్యాటక శాఖ అధికారి సత్యనారాయణ తెలిపారు. గురువారం కలెక్టరేట్ లోని తన కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన సింగవరం వెంకటరమణ రూ.2.18లక్షలకు దక్కించుకున్నాడు. కాగా..2017లో నిర్వహించిన వేలంలో రూ.40వేల పలుకగా ప్రస్తుతం రూ.2.18 లక్షలకు పెరిగిందని చెప్పారు.

సకాలంలో విత్తుతో మంచి దిగుబడులు



రైతులకు విత్తనాలు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల (సెంట్రల్): ఖరీఫ్‌లో ముందస్తు వర్షాలకు విత్తనాలు నాటుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చని ఆర్ఏఆర్ఎస్ సహ సంచాలకులు వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం పరిశోధనా కేంద్రం ప్రాంగణంలో విత్తన దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ...ఈనెల 15 నుంచి జూలై 15వ తేదీ మధ్య విత్తుకుని సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే చక్కని ఫలితాలు లభిస్తాయని చెప్పారు. విత్తన శుద్ధి, మొక్కల సాంద్రత, అంతర కృషి, యాంత్రీకరణతో వ్యవసాయం లాభసాటిగా ఉంటుందన్నారు. పరిశోధనా స్థానంలో కొత్త రకాల వరి, కొర్ర, జొన్న, పొద్దుతిరుగుడు, కుసుమ, పప్పుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త జయలక్ష్మి, శాస్త్రవేత్తలు నరసింహులు, రమాదేవి, ప్రభాకర్, రవి ప్రకాష్, మంజునాథ్, రైతులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



బదిలీ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

గోస్పాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బదిలీ అయిన ఉద్యోగులను గురువారం ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గతంలో ఎంపీడీఓ పనిచేసిన సుగుణశ్రీ, ఈఓఆర్డీ నాగేంద్రుడు, సూపరింటెండెంట్ సావిత్రమ్మను సన్మానించారు. సూపరింటెండెంట్ సావిత్రమ్మ ఎంపీడీఓగా పదోన్ననతి పొంది కర్నూలు జిల్లా తుగ్గలికి బదిలీ అయ్యారు. ఎంపీపీ ఆర్థర్ సైమాన్, వైస్ ఎంపీపీ జనార్దన్ రెడ్డి, రాజు, సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రహ్లాదరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శకుంతలమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్‌ల అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల అధికారులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను పటిష్టంగా అమలు చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: ఈనెల 23వ తేదీ నుంచి ప్రజా సమస్యల పరిష్కారం – జగనన్న సురక్ష కార్యక్రమం పటిష్టంగా అమలు చేయాలని, ఇందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. గురువారం జగనన్న సురక్ష – జగనన్నకు చెబుదాం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, భూముల రీ సర్వే, ప్రాధాన్యత భవనాల పూర్తి తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ చాంబర్ నుంచి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి వివిధ శాఖల జిల్లా అధికారులు జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలపై దృష్టి సారించి సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా గర్భిణులు, చంటి పిల్లల్లో రక్తహీనతను అధిగమించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. గృహాల నిర్మాణం, గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు తదితర ప్రాధాన్యత భవనాలన్నీ సెప్టెంబర్ 15లోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.